## హైదరాబాద్‌లో ఐపీఎల్ మ్యాచ్.. 2700 మంది పోలీసులతో భద్రత

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐపీఎల్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. మార్చి 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 2025 కోసం ఇప్పటికే ఘనంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక 23వ తేదీన హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశారు. మొత్తం 2700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు రాచకొండ కమిషనర్ తెలిపారు. 'ఉప్పల్ స్టేడియంలో 450 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశాం. స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ పెట్టి ఏసీపీ సారథ్యంలో భద్రతను పర్యవేక్షిస్తాం. స్టేడియం ఎంట్రన్స్ వద్ద స్నిపర్ డాగ్స్, బాంబ్ స్క్వాడ్ రెడీగా ఉంచాం. క్రికెట్ మ్యాచ్ చూసేందుకు వచ్చే మహిళల కోసం షీటీమ్స్ కూడా అలర్ట్ చేశాం. క్రికెట్ అభిమానుల కోసం ఐదు చోట్ల ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశాం. స్టేడియంలోకి వాటర్ బాటిల్స్, ల్యాప్‌టాప్, అగ్గిపెట్టెలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించాం'


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక


## పోసానికి బెయిల్ మంజూరు..

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళికి ఊరట కలిగింది. గుంటూరు కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. సీఐడీ నమోదు చేసిన కేసులో పోసానికి బెయిల్ లభించింది. పోసాని బెయిల్ పిటిషన్‌పై గుంటూరు కోర్టు బుధవారం విచారణ జరిపి తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది. తిరిగి నేడు విచారణ జరిపి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పోసాని, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ న్యాయవాదుల ద్వారా సీఐడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కోర్టు తీర్పును వాయిదా వేసింది. కాగా, పోసానిని ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఏపీలో ఆయనపై 19 కేసులు నమోదైనట్టు తెలుస్తోంది. అవార్డులకు సంబంధించిన సినీ పరిశ్రమలో విద్వేషాలు రగిల్చే వ్యాఖ్యలు చేశారనిచంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయనపై ఫిర్యాదులు అందడంతో కేసులు నమోదు చేశారు.


సంపుటి: 01 సంచిక : 171. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శనివారం.22.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00


# మాజీ వర్సెస్ తాజా



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శుక్రవారం అసెంబ్లీలో మాజీ, తాజా ఆర్థిక మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, భట్టి విక్రమార్క మధ్య వాగ్వాదం కొనసాగింది. పరస్పర వాగ్బాణాలతో సభ హీటెక్కింది. సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు మరో మంత్రి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా హరీశ్‌రావుపై ఎదురుదాడికి దిగారు. మధ్యలో బీఆర్ఎస్ సభ్యుడు తలసాని శ్రీనివాస యాదవ్ సైతం జోక్యం చేసుకున్నారు. ఈ క్రమంలో 'అధ్యక్షా.. మీరే మాకు పెద్ద దిక్కు, ప్రభుతాన్ని నేను ఉద్దేశపూర్వకంగా విమర్శించటం లేదు, బడ్జెట్‌లోని లోపాలను ఎత్తి చూపితే, వాటిని ప్రభుత్వం సవరించుకుంటే పేదలకు న్యాయం జరుగుతుందనేదే మా ఆశ' అంటూ హరీశ్ వ్యాఖ్యానించటంతో పరిస్థితి సద్దుమణిగింది.

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ఏడో రోజైన శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సభ ఆరంభమైంది. ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి సవరణ బిల్లు–2025ను, తెలంగాణ న్యాయవాదుల క్లర్కుల సంక్షేమ నిధి సవరణ బిల్లు–2025ను సభలో ఉంచినట్టు స్పీకర్ తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వార్షిక నివేదికను, రాష్ట్ర తోళ్ల పరిశ్రమ సంస్థ వార్షిక నివేదికను ప్రభుత్వం సభ ముందు ఉంచినట్టు తెలిపారు. అనంతరం 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించిన వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చను స్పీకర్ ప్రారంభించారు. తొలుత ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి తన్నీరు హరీశ్‌రావును మాట్లడాల్సిందిగా ఆయన సూచించారు. ఈ క్రమంలో హరీశ్‌రావుకు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, హరీశ్‌రావుకు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మధ్య కొద్ది సేపు సంవాదం నడిచింది. ప్రతిపక్ష సభ్యుడిగా బడ్జెట్‌ను సమగ్రంగా విశ్లేషించటం ద్వారా అందులోని లోపాలను ఎత్తి చూపటం తన బాధ్యతని హరీశ్‌రావు తెలిపారు. తద్వారా రాష్ట్రంలోని పేదలు, బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేయాలన్నదే తన తపన తప్ప ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా విమర్శించటం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బడ్జెట్‌పై ప్రతిపక్ష సభ్యులు ఎంతసేపు మాట్లాడినా తనకు అభ్యంతరం లేదనీ, కానీ ఆ పరిధిని దాటి, అవాస్తవాలు, సత్యదూరమైన మాటలు మాట్లాడటం సరికాదన్నారు. బడ్జెట్‌పైన ప్రసంగించాలని సూచిస్తే రాజకీయ ప్రసంగాలు చేయటమేంటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్కమార్క కలుగజేసుకుని హరీశ్‌రావు తన ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌ను, తనను, ఇతర మంత్రులను ఉద్దేశించి చులకన భావంతో మాట్లాడటం సమంజసం కాదని అన్నారు. బుద్ధిహీనులు, అజ్ఞానులు అనే పదాలను ఉపసంహరించుకోవాలని హరీశ్‌రావుకు సూచించారు. సభాపతితో వాదనకు దిగటం సరికాదని హితవు పలికారు. బడ్జెట్‌పై చర్చలో హరీశ్‌రావుతోపాటు అధికార పక్షం నుంచి బాలూ నాయక్, బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు తదితరులు ప్రసంగించారు.

బడ్జెట్‌పై హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను, వివిధ రంగాలకు కేటాయింపులను, బీఆర్ఎస్ హయాంలోని పద్దులను సరిపోల్చుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు. గతంలో అమలైన వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు, ఇప్పుడు వాటి పరిస్థితులను ఏకరువు పెట్టారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపాదించిన బడ్జెట్ మీద రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆ వాగ్దానాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లిందని వాపోయారు. ఆ పార్టీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి తదితర హామీల సంగతేంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో లక్షా 62 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు. తామిచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకే నియామక ప్రతాలను అందజేసిన ముఖ్యమంత్రి, మంత్రులు ఆ ఘనత తమదేనంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదంటూ అధికార పక్షం ఆరోపిస్తోందనీ, కానీ తమ ప్రభుత్వ హయాంలో 6,47,479 రేషన్ కార్డులను జారీ చేశామని హరీశ్‌రావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తద్వారా మొత్తం 20,69,033 మందికి లబ్ది జరిగిందని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల కోసం రూ.4 వేల కోట్లు కేటాయించి, ఖర్చు చేశామని వివరించారు. తాము అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కింద మూడు బ్యారేజీలు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌజులు, 16 రిజర్వాయర్లు. 203 కి.మీ. టన్నెళ్లు, 231 కి.మీ.గ్రావిటీ కాలువలు భాగంగా ఉన్నాయని విశదీకరించారు. అందులోఒక్క మేడిగడ్డలోని 7 బ్లాకుల్లోని 1 బ్లాకులో, 1 పిల్లర్ మాత్రమే కుంగిందని గుర్తు చేశారు. ఇలాంటి వాస్తవాలను మరుగుపరిచి, కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందంటూ దుష్ప్రచారం చేయటం సరికాదన్నారు.

డిప్యూటీ సీఎం, ముఖ్య కార్యదర్శికి శుభాకాంక్షలు

వరసగా మూడుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఈ సందర్భంగా హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. వరసగా బడ్జెట్ కూర్పులో వరసగా 14 సార్లు కీలక భూమిక పోషించిన ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కూడా ఆయన అభినందించారు.

# అకాల వర్షం..రాలిన మామిడి పూత, కాత..నేల వాలిన వరి, మొక్కజొన్న




అమృత్ తెలంగాణ: ఉమ్మడి నిజామాబాద్, ఒకవైపు ఎండలు ముదిరి భూగర్బ జలాలు ఎండిపోతుండటంతో పంటలను కాపాడుకునేం దుకు నానాతంటాలు పడుతున్న రైతులను శుక్రవారం కురిసిన అకాల వర్షం దెబ్బతీసింది. అకస్మాత్తుగా వడగండ్లు, ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. వరి పంట ధాన్యం నేలరాలింది. ఈదురుగాలులకు మొక్కజొన్న, పసుపు పంటను ఆరబెట్టిన రైతులు ఇబ్బందులు పడ్డారు. మామిడి పూత, కాత రాలింది. రాష్ట్రంలోని ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి వర్షం కురవడంతో ఉక్కపోతతో తల్లడిల్లుతున్న వారికి ఊరటనిచ్చింది. కానీ పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని మద్దుల్‌తండా, వాడి, సీతాయిపేట్, హొన్నాజిపేట్ గ్రామాల్లో గాలిదుమారం వడ్లగండ్ల వాన పడటంతో మరో పదిరోజుల్లో కోత కోసే సమయంలో వరి గొలకలు రాలిపోవడం, కొంతమేర పంట నేలవాలింది. వెండోరా మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న, పసుపు పంట తడిసి ముద్దయింది. రోడ్లపై ఆరబోసిన రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట్, లింగంపేట్, రామారెడ్డి మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం పిడుగు పడి రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన సాకలి సాయిలు, గాలెం నారాయణకు చెందిన గేదెలు రోజువారీగా గ్రామ సమీపంలోని చెరువు వద్ద మేపుతుండగా.. మేత మేస్తున్న రెండు గేదెలపై పిడుగు పడటంతో గేదెలు మృత్యువాతపడ్డాయి.

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని గ్రామాల్లో కురిసిన గాలివాన భీభత్సం సృష్టించింది. గాంధారి పల్లిలో మామిడి తోటలో కాయలు నేలరాలాయి. చింత చెట్లకు చింత పండు తడిసి ముద్దయింది. మరికొన్ని చోట్ల ఈదురుగాలులకు చెట్లు నెలకొరిగాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడి, కొన్ని గ్రామాల్లో అంధకారం నెలకొంది. వరి రైతులకు మాత్రం ఎండిపోయే దశలో ఉన్న పొలాలకు ఈ వర్షం ఎంతగానో మేలు చేసిందని రైతుల్లో ఆనందం కనిపించింది. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, న్యాల్‌కల్ మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వట్‌పల్లి మండలంలో అకాల వర్షానికి మొక్కజొన్న పంట నేలకొరిగింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం భారీ నుంచి మోస్తారు వర్షపాతం నమోదైంది. కరీంనగర్‌లోని చొప్పదండి మార్కెట్‌లో మొక్కజొన్న తడిసింది. జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి, పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి, ధర్మపురి మండలాల్లోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలమట్టమయింది. కోరుట్ల నియోజకవర్గం పరిధిలోని మల్లాపూర్, కోరుట్ల, ఇబ్రహీంటపట్నం, మేట్‌పల్లి మండలాల్లో ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురిసాయి. పెద్దపల్లి జిల్లాలోని జూలపల్లి మండలంలో రాళ్ల వర్షం కురిసింది. పిడుగుపాటుతో గేదె మృత్యువాత పడింది. పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలమట్టం అయి రైతుల్లో ఆందోళన నెలకొంది. మంథని, గోదావరిఖని పట్టణాల్లో కురిసిన భారీ వర్షానికి కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడతో పాటు పలు ప్రాంతాల్లో మోస్తారు వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్‌లో భారీగా వడగండ్ల వాన కురిసింది.

# తాగునీటి సమస్యలు రానివ్వం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ప్రస్తుతం తాగునీటికి ఎక్కడా సమస్య లేదనీ, కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారం పోగానే తాగునీరు రావడం లేదనే దుష్ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వాయర్లల్లో తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం హైదరాబాద్‌లోని మిషన్ భగీరథ శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిషన్ భగీరథలో అప్పటి అధికారులు, సిబ్బందే పని చేస్తున్నారని గుర్తు చేశారు. రిజర్వాయర్లల్లో తాగునీటికి తగినంత నీటి నిలువలు ఉన్నాయని చెప్పారు. గతంలో తాగునీరు అందని గ్రామాలకు కూడా ఈసారీ సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఆదిలాబాద్ వంటి జిల్లాలతోపాటు ఏజెన్సీ గ్రామాల్లో బోర్లు వేసి తాగునీటిని అందిస్తున్నట్టు చెప్పారు. తాగునీటి సమస్యలు, నీటి కటకట అంటూ ఈమధ్య వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల పట్ల మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యకం చేశారు. అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏదైనా సాంకేతిక కారణాలతో అవాంతరాలు ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రకటించారు. తాగునీటి అవసరాలకు ప్రతి జిల్లా కలెక్టర్ వద్ద రూ. 2 కోట్లు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. మిషన్ భగీరథ రాష్ట్ర కార్యాలయంలో 24 గంటలపాటు పనిచేసే కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. వేసవి ముగిసే వరకు నిరంతరాయంగా సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, సీఈ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు రాజీవ్ స్ఫూర్తి

## ఉప్పల్ స్టేడియంలో మాజీ ప్రధాని విగ్రహావిష్కరణ



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: యువతకు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ స్ఫూర్తి ప్రదాత అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..'వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో స్టేడియానికి రాజీవ్‌గాంధీ పేరు పెట్టారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా స్టేడియంలో ఆయన విగ్రహం ఆవిష్కరించటం సంతోషంగా ఉంది. ప్రధానమంత్రిగా యువతకు దశ, దిశ చూపించిన వ్యక్తి రాజీవ్‌గాంధీ. జాతీయ జట్టు తరఫున ఆడుతున్న మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మ సహా గొంగడి త్రిషలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. క్రికెట్ సహా ఇతర క్రీడలకు ప్రజా ప్రభుత్వంలో ప్రాధాన్యత ఇస్తున్నామని' శ్రీధర్ బాబు అన్నారు. శాట్ చైర్మెన్ కే. శివసేనారెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు, హెచ్‌సీఏ ఆఫీస్‌బేరర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.16.70 లక్షల కోట్లు ఖర్చు చేసింది కానీ: భట్టి



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తెలంగాణలో గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 16.70 లక్షల కోట్ల నిధులు ఖర్చు చేశారని, అయితే ఆ మొత్తంతో ఏం నిర్మించారో, ఏం సాధించారో చెప్పాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రశ్నించారు. కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా విచ్చలవిడిగా అప్పులు చేసిందని ఆయన ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్షల కోట్లు ఎందుకు ఖర్చు చేశారో నిలదీశారు. నాగార్జున సాగర్ నిర్మించారా? శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించారా? ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించారా? విమానాశ్రయం నిర్మించారా? అంటూ ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక్కదానికే లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, అదీ కూలిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. సింగరేణికి కూడా రూ. 77 వేల కోట్లు బకాయిలు పెట్టి పోయారని ఆరోపించారు. అసెంబ్లీ ఆమోదం లేకుండానే రూ. 2.30 లక్షల కోట్లను ఖర్చు చేసిన విషయాన్ని కాగ్ వెల్లడించిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పదేళ్లలో ఏ గ్రామంలో అయినా డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారా? అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ, నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదని ఆయన ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డును రూ. 7 వేల కోట్లకే 30 ఏళ్ల కాలానికి అమ్మేశారని ఆరోపించారు. తద్వారా భవిష్యత్తులో ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని కూడా ముందే తీసుకున్నారని విమర్శించారు. నెరవేర్చలేని హామీలు ఇచ్చి కేసీఆర్ ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. 2016–17లో రూ. 8 వేల కోట్లు, 2018–19లో రూ. 40 వేల కోట్లు, 2021–22లో రూ. 48 వేల కోట్లు, 2022–23లో రూ. 52 వేల కోట్లు, 2023–24లో రూ. 58,571 కోట్లు ఖర్చు చేయలేదని ఆయన పేర్కొన్నారు.

# బెట్టింగ్ యాప్ కేసులో శ్యామలకు ఊరట..



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బెట్టింగ్ యాప్ వ్యవహారంలో తెలంగాణ పోలీసులు పలువురు సెలబ్రిటీలు, సినీ తారలకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలువురు విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో నోటీసులు అందుకున్న యాంకర్, నటి శ్యామల తాజాగా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేసిన వ్యవహారంలో తనపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టివేసేలా ఆదేశించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు శ్యామల. ఈ పిటిషన్ పై తాజాగా హైకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. శ్యామలను అరెస్ట్ చేయొద్దంటూ పోలీసులకు ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఈ వ్యవహారంలో పోలీసుల విచారణకు సహకరించాలని యాంకర్ శ్యామలకు సూచించింది. సోమవారం నుంచి ఈ కేసులో పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని పేర్కొంది. ఈ విషయంలో పోలీసులు నోటీసులు ఇచ్చి విచారించొచ్చని సూచించింది. ఇక ఈ బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో సినీ తారలు రానా, విజయ్ దేవరకొండలకు కూడా పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే వారి కేవలం స్కిల్ బేస్డ్ యాప్స్ కు మాత్రమే ప్రచారం చేశారంటూ వారి పీఆర్ టీమ్స్ ఇప్పటికే ప్రకటనలు జారీ చేశాయి.

# రోడ్డు ఇలా వెళ్ళేది ఎలా....

సంవత్సరం గడుస్తున్న పూర్తికాని రెండు కిలోమీటర్ల ఇచ్చోడ రోడ్డు.....
రోడ్డుపై నరకం అనుభవిస్తున్న వాహనదారులు...
కాంట్రాక్టర్ నేరలక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఇచ్చోడ ప్రజలు...
బస్సులో నిర్మల్ నుండి ఆదిలాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికులకు అర్ధగంట ఆలస్యం



రోడ్డుపై వెళ్లాలంటే మండుటెండలో నుక్కుంటూ వెళ్లాల్సిందే



ఇచ్చోడ రోడ్డుపై గిట్టిలో కూరుకుపోయిన కారు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి పరాకాష్ట



రోడ్డుపై కనకరాను పారబోసి గాలికి వదిలేసిన కాంట్రాక్టర్

అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మార్చ్21 అమృత్ తెలంగాణ ఇచ్చోడ మండల కేంద్రంలో రోడ్డు పనులు దాదాపు సంవత్సరం నర గడుస్తున్న ఇప్పటికీ పూర్తి కాకపోవడం చూస్తుంటే కాంట్రాక్టర్ ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడో అర్థమవుతుంది కాంట్రాక్టర్ను ఒక్క మాట అనే స్థితిలో ఇక్కడి రాజకీయ నాయకులు లేకపోవడం సిగ్గుచేటు నిత్యం రోడ్డుపై వెళ్తూ నరకం అనుభవిస్తున్న వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడుతూనే కాలం వెళ్లదీస్తున్నారు ఇచ్చోడ గ్రామంలో ఏ వాడ ఎక్కడికి వెళ్లాలన్న ఆ రోడ్డు గుండా వెళ్లాల్సి ఉంటుంది ఆ రోడ్డుపై కార్లు బైక్లు పెద్ద వాహనాలు ఆ రోడ్డుపైకి వెళ్లినయంటే గిట్టిలో నుండి దాటాలి అంటే గంటలు పడుతుంది ప్రతిరోజు నరకం అనుభవించాల్సిందే వవాహణాల టైర్లు గిట్టిలో తిరుగుతున్నాయి తప్ప అవి మాత్రం కదలడం లేవు రోడ్డు పరిస్థితి చూస్తే 20 సంవత్సరాల క్రితం ఉన్న పరిస్థితి జ్ఞాపకం వస్తుంది ఒకపక్క ఆర్టీసీ బస్సులు చుట్టూ తిరిగి పోవాల్సిన పరిస్థితి ఏర్పడ్డది ప్రజల అవస్థలను పట్టించుకోకుండా ప్రజా ప్రతినిధులు సంబంధిత కాంట్రాక్టర్ ఆ రోడ్డును చూసి సిగ్గుగా లేదా అని ప్రజలు అంటుంటే వారు తల ఎక్కడ పెట్టుకుంటున్నారో అర్థమవుతలేదు ప్రజల సమస్యలను తీర్చకపోతే ఇటువంటి మాటలు పడాల్సి వస్తుందని ప్రజా ప్రతినిధులుగా చెప్పుకునే నాయకులకు తెలుసు కానీ వారు ఇటువంటి ఏమి పట్టించుకోకుండా ఎన్నికల సమయంలో మాత్రం అడ్డగోలు హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని ఎమ్మెల్యేలుగా చెలమణి అవుతారు కానీ ఇటువంటి పనులను చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు ఇప్పటికైనా ఇచ్చోడ ప్రజల సహనాన్ని పరీక్షించకండి వారు తిరగబడితే మాత్రం మీ పరిస్థితి గోరంగా ఉంటుంది సంవత్సరాలు గడుస్తున్నా రెండు కిలోమీటర్ల రోడ్డును వేయకపోవడం చూస్తే నిర్లక్ష్యం కాదా ఇప్పటికైనా వెంటనే త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు దుబ్బ దూళి తో వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు సంబంధిత అధికారులు కల్పించుకొని త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలని కోరుతున్నారు

# పక్కా డ్రైన్ నిర్మాణం చేపట్టాలి

ఎంపీ తిరుపతి రెడ్డి కి వేడుకోలు..... గత మూడు సంవత్సరాల నుంచి మురికి సమస్య పరిష్కారం కావడం లేదని బాధితుడి ఆవేదన.... సంబంధిత అధికారులు ఇప్పటికైనా సమస్య పరిష్కరిస్తారని ఆశతో ఎదురు చూస్తున్న......




చాక్పల్లి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి చెత్త రోడ్లపై వేయకూడదు మురికి సమస్యను క్షేత్రస్థాయిలో ప్రజలను అడిగి తెలుసుకున్న ఎంపీఓ తిరుపతిరెడ్డి,

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చి 21 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని చాక్ పల్లి గ్రామానికి చెందిన సయ్యద్ అమీర్ వెల్డింగ్ షాప్ యజమాని సయ్యద్ ఖమర్ ఎంపీఓ తిరుపతిరెడ్డికి పక్కా డ్రైన్ నిర్మించాలని వేడుకున్నారు మూడు సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న ఇంటి ముందర నుండి మురికి నీరు పోతుండడం ఇబ్బందికరంగా మారిందని దోమలు పారిశుద్ధ్య లోపం తో ఇంట్లో ఉన్న చిన్న పిల్లలు తరచు అనారోగ్య బారిన పడుతున్నారని పేర్కొన్నారు మూడు సంవత్సరాల నుండి ఇదే తీరు కొనసాగుతుందని ఈ సమస్యను త్వరగా పరిష్కరించి ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు క్షేత్రస్థాయిలో తిరుపతిరెడ్డి పర్యటించి మురికి నీరు సమస్యను అడిగి తెలుసుకున్నారు త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ మల్టీ పర్పస్ సిబ్బంది రసూల్ తదితరులు పాల్గొన్నారు

## అర్హులైన దివ్యాంగులకు UDID కార్డులు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో UDID కార్డుల జారీపై మార్గదర్శకాలు, దివ్యంగుల సమస్యలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, దివ్యాంగులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సదరం సర్టిఫికెట్ కు బదులుగా అర్హులైన ప్రతి దివ్యాంగుడికి యూనిక్ డిసెబిలిటీ ఐడీ (UDID) నంబర్‌ను కేటాయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మార్చి 1, 2025 నుండి దివ్యాంగుల పునరావాసం, సాధికారత కోసం డైనమిక్ వెబ్ ఎనేబుల్ సిస్టమ్‌ను రూపొందించిందని తెలిపారు. మీ సేవా కేంద్రాల ద్వారా నూతనంగా UDID కార్డులను జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఉన్నవారు, నూతనంగా %ఖఊ×ఊ% కార్డుల కోసం మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఆసుపత్రిలో స్లాట్ బుకింగ్ చేసి, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత UDID కార్డులు జారీ చేస్తారని తెలిపారు. ఈ కార్డులు 21 రకాల వైకల్యం కలిగిన దివ్యాంగులకు అందించడం జరుగుతుందని, స్పీడ్ పోస్ట్ ద్వారా నేరుగా దివ్యాంగుల ఇంటి చిరునామాకు అందుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా అర్హులైన దివ్యంగులకు ప్రభుత్వ పథకాల లబ్ది, పునరావాసం, సాధికారతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అనంతరం UDID కార్డుల జారీ మార్గదర్శకాలపై సంబంధిత విభాగాల వైద్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, దివ్యాంగులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించి, అక్కడి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్






అమృత్ తెలంగాణ నిర్మల్‌న్యూస్‌తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు తేది: 21.03.2025 నుండి ప్రారంభమైన 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో నిర్మల్ జిల్లాలోని భైంసా పట్టణం లోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాల లో గల పరీక్ష కేంద్రం జిల్లా ఎస్పీ ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడి బందోబస్తు ఏర్పాట్లను మరియు పరీక్షా రాయడానికి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు ఉండవలసిన కనీస సదుపాయాలు, అత్యవసర మెడికల్ సేవల గురించి పర్యావేక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 10వ తరగతి పరీక్షల నిర్వాహణ గైడ్ లైన్స్ పాటిస్తూ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 BNSS యాక్ట్ – 2023 అమలులో వుంటుందని, పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ వివరించారు. పరీక్షా కేంద్రాల దగ్గర ఉన్నటువంటి అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని ముందుగానే నోటీసులు జారీ చేసి, మూసివేయించడం జరిగింది అన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లైతే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీసు వారికి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎస్పి వెంట అవినాష్ కుమార్ ఐపిఎస్, ఇన్స్పెక్టర్ లు నైలు, గోపినాథ్ తదితరులు ఉన్నారు

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుండి MA&UD ప్రిన్సిపాల్ సెక్రటరీ దానకిషోర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆమె పాల్గొన్నారు. జిల్లాలు, మున్సిపాలిటీల వారిగా ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతు, ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ) కు దరఖాస్తు చేసుకున్న వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పలువురు దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లిస్తున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలలో ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని తెలిపారు. మార్చి 31 వ తేదీతో లే అవుట్ల దరఖాస్తుల రుసుము చెల్లించే గడువు ముగుస్తుందన్నారు. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన రుసుములు చెల్లించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, యాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేతకాని కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



జన్నారం :అమృత్ తెలంగాణ: ఎస్సీలో ఉన్న నేతకాని కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని నేతకాని సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అన్నారు. శుక్రవారం జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ గానూతనంగా బాధ్యతలు స్వీకరించిన దుర్గం లక్ష్మి నారాయణను శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ ఎమ్మెల్యే బెడమా బొజ్జు పటేల్ నేతకాని కులాన్ని గుర్తించి జన్నారం మండల మార్కెట్ కమిటీ చైర్మన్గా దుర్గం లక్ష్మీనారాయణ ను నియమించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యేకు నేతకాని సమాజమంతా రుణపడి ఉంటుందన్నారు. నేతకాని కులస్తులు సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారన్నారు. నేతకాని కులస్తులు అభివృద్ధి చెందాలంటే కార్పొరేషన్ ఏర్పాటు ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, రాష్ట్ర అధికార ప్రతినిధి గోల్లే రాజా మల్లు, జన్నారం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకటయ్య, బండారి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బుడగ జంగాలపై వివక్ష ఎంత కాలం..?



జన్నారం :అమృత్ తెలంగాణ: జన్నారం మండల సిపిఐఎం కమిటీ ఆధ్వర్యంలో పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని బుడగ జంగాల ఎస్సీ కాలనీలో సమస్యలను తెలుసుకోవడం కోసం పర్యటించడం జరిగిందని ఆ పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కాలనీ ఏర్పడి 20 సం.రాలు గడిచిపోయిన నేటికీ ఇక్కడి ప్రజలు సమస్యల సుడిగుండంలోనే జీవిస్తున్నారన్నారు. రోజువారి కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్న ఈ ప్రజలకు గత ప్రభుత్వాలు కానీ,ప్రస్తుత ప్రభుత్వం కానీ కనీస సౌకర్యాలు కల్పించకుండా ఎస్సీ బుడగ జంగాల వారిపై వివక్షతను కొనసాగిస్తున్నారు. ఇక్కడ ప్రధాన సమస్యలు రోడ్లు,మురికి కాలువలు, త్రాగునీరు,ఇండ్లపై నుంచి ఉన్న 11 కెవి కరెంట్ వైర్లు తొలగించడక పోవడంతో ప్రజలు ప్రమాదాలకు గురౌతున్నారు.వర్షాకాలంలో వచ్చే వరద ముంపు మూలంగా ఇండ్లు మునిగిపోకుండా కరకట్ట నిర్మాణం చేయడం అదేవిధంగా ఇక్కడి పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకపోవడం సోచనీయం పాలకులు ఎంతమంది మారి ఇక్కడి ప్రజల బతుకులు మాత్రం మురికి కోపంలో జీవిస్తున్నట్టుగా ఉంది. దళితుల పట్ల ప్రభుత్వాలు, అధికారులు ఎంత వివక్ష చూపిస్తున్నారు.ఈ కాలనీ చూస్తే అర్థమవుతుందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సిపిఐ ఎం ఆధ్వర్యంలో రాబోయే కాలంలో పోరాట కార్యక్రమాలు చేపట్టవలసిన తెలియజేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో దుంపల రంజిత్ కుమార్ సిపిఐఎం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు,కనికరం అశోక్ సిపిఐఎం జన్నారం మండల కార్యదర్శి,మగ్గిడి జయ మండల కమిటీ సభ్యురాలు మరియు నాయకులు ఆడే చంద్రకళ, ఒరగంటి వనిత,తలండి దీపిక,గెడం లక్ష్మి,కనికరపు జమున తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ కెనాల్ పడి విద్యార్థి మృతి

జన్నారం :అమృత్ తెలంగాణ: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మ పెల్లి సమీపంలోని కాకతీయ కెనాల్ పడి జన్నారం మండలం చింతల పల్లె గ్రామానికి చెందిన వాసాల అరవింద్ (21) అనే స్టూడెంట్ ప్రమాదవశస్తు పడి మృతి చెందాడు. అరవింద్ కరీంనగర్ లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ లో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అరవింద్ రెండు రోజుల క్రితం అతని స్నేహితులతో కలిసి కెనాల్ లోకి ఈతకు వెళ్ళాడు. అతని ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. అరవింద్ మృత దేహాన్ని అక్కడి పోలీసులు బయట కు తీసి కరీంనగర్ గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీ లో ఉంచారు. అరవింద్ మృతి విషయం తెలియగానే అయన తల్లి తండ్రులు లింగన్న, శంకరవ్వ తోపాటు బంధువులు కరీంనగర్ హస్పిటల్ కు తరలివెళ్లారు.

# కాలం నుదిటిపై మెరిసే సింధూరం
# గొప్ప దేశభక్తుడు మన భగత్ సింగ్....



కాలం నుదుటిపై మెరిసే సింధూరం మన భగత్ సింగ్



అమృత్ తెలంగాణ బ్యూరో సీనియర్ రిపోర్టర్ కేఎల్ రాములు,

(మార్చి 23 భగత్‌సింగ్ 94వ వర్ధంతి) అమృత్ తెలంగాణ "మనకు సోషలిస్టు విప్లవం కావాలి. దానికి ముందు రాజకీయ విప్లవం రావాలి. రాజకీయ విప్లవమంటే ప్రభుత్వం బ్రిటీష్ పాలకుల నుండి భారతీయుల చేతుల్లోకి మారడం మాత్రమే కాదు. విశాల ప్రజా మద్దతుతో విప్లవ పార్టీ చేతుల్లోకి అధికారం రావాలి. ఆ తర్వాత సోషలిస్టు ప్రాతిపదికపై మొత్తం సమాజ పునర్నిర్మాణానికి పూనుకోవాలి" స్వాతంత్ర్యానంతర భారతదేశ నిర్మాణంపట్ల భగత్‌సింగ్ భావనలివి. తనను ఉరితీయడానికి కొద్దిరోజుల ముందు% 1931 ఫిబ్రవరి 2న జైలు నుండి వెల్లడించిన ఓ వ్యాసంలోని ఈ వ్యాఖ్యలు ఆయన లోతైన ఆలోచనలకు ప్రతీకలు. భగత్‌సింగ్‌ను కేవలం ఓ స్వాతంత్ర్య సమరయోధుడిగా, బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన సాహసిగా మాత్రమే చూస్తే అది అసమగ్రమేనని ఈ వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. చరిత్రలో ఏ వ్యక్తినైనా పరిశీలించేందుకు, అందునా భగత్‌సింగ్ లాంటి ఆలోచనాపరుడిని, విప్లవకారుడిని అంచనా వేయడానికి లోతైన పరిశీలన అవసరం. మౌలికంగా ఆ వ్యక్తి ఆలోచనా విధానం, దాని వికాసం తెలుసుకోకుండా పరిశీలిస్తే వాస్తవాలకు దూరంగా ఉండిపోతాం. పాక్షిక సత్యాలకే పరిమితమవుతాం. భగత్‌సింగ్ విషయంలో అదే జరిగింది. అందుకు కారణం వలసపాలకులు సరిగ్గా నమోదు చేయని అధికారిక రికార్డులు కావొచ్చు, ఆయన ఆలోచనల విస్తృతిని నివారించాలన్న స్వాతంత్ర్యానంతర పాలకవర్గాల ఉద్దేశాలు కావొచ్చు, మితవాద శక్తుల కుతంత్రాలు కావొచ్చు. ఇలా కారణాలేమైనప్పటికీ మనం భగత్‌సింగ్‌ను పూర్తిగా తెలుసుకోవడంలో వెనుకబడి పోయాం. ఫలితంగా ఆయన కేవలం గొప్ప దేశభక్తుడిగా, పోరాట యోధుడిగా, త్యాగధనుడిగానే మనలో చాలామందికి గుర్తుండిపోయాడు. బ్రిటీష్ పాలన నుంచి విముక్తి సాధించడమే ఆయన ఏకైక రాజకీయ లక్ష్యంగా ప్రచారంలో ఉండిపోయింది. కానీ అంతకు మించిన ఆయన సైద్ధాంతిక పునాది గురించి, ప్రాపంచిక దృక్పథం గురించి ఎంతమందికి తెలుసు? అది తెలుసుకోవడం ఇప్పుడు దేశానికి చాలా అవసరం. నేడు దేశంలో నిజం నిందలు మోస్తున్నది. అబద్ధం అందలమెక్కి ఊరేగుతున్నది. మనుషులు మనుషులుగా కొనసాగే పరిస్థితులు సన్నగిల్లిపోతున్నాయి. మోసం ద్వేషం ప్రజల మెదళ్లలోకి చొప్పించబడుతున్నది. అనేకానేక ఆధిపత్యాల నుంచి, అజ్ఞానపూరిత మూఢనమ్మకాల నుంచి దేశాన్ని కాపాడవలసిన పాలకులు, శాస్త్రీయతను పెంపొందించాల్సిన ప్రభుత్వాలే పౌరులను తిరోగమనంలో ముంచెత్తుతున్న వర్తమానమిది. ప్రశ్నిస్తే పౌరస్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని నిర్బంధంలోకి నెట్టేస్తున్న కాలమిది. మతాన్ని రాజ్యంతో విడదీయలేనంతగా కలిపేసి, మత ప్రాతిపదికన రాజకీయ సమీకరణలకు పాల్పడుతున్న రోజులివి. విశ్వాసం విద్వేషంగా మారి మన రాజ్యాంగ స్ఫూర్తికే సవాలు విసురుతోంది. మన ప్రజాస్వామ్యం మునుపెన్నడూ లేనంతగా ప్రమాదంలో పడింది. సమాజంలో సామరస్యం బీటలువారుతున్నది. ప్రజాజీవితంలో భయం రాజ్యమేలుతున్నది. ఒక అభద్రతాభావం వెంటాడుతున్నది. అబద్ధాల పునాదుల మీద మిథ్యా చరిత్రని నిర్మించే మిత- మతవాద రాజకీయాలు సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నాయి. దీన్ని ప్రశ్నించాల్సిన పౌరసమాజం మౌనంగా వీక్షిస్తున్నది. ఈ మొత్తం సందర్భాన్ని మనం ఎలా చూడాలి? ఎలా ఎదుర్కోవాలి? లౌకిక, ప్రజాస్వామిక శక్తుల పాత్ర ఎలా వుండాలి? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానమివ్వగలిగిన మేధోసంపత్తిని మనకు వారసత్వంగా అందించి పోయాడు భగత్‌సింగ్. అది పూర్తిగా ఆచరణాత్మకమైనదీ, సైద్ధాంతికమైనది. అందువల్ల భగత్‌సింగ్‌ను అధ్యయనం చేయటం నేటి తరానికి అత్యంత అవసరం. "మతమౌఢ్యం, మతోన్మాదం మన పురోగతికి పెద్ద అడ్డుగోడలు. అవి దారిలో అనేక ఆటం కాలు సృష్టిస్తాయి. మనం వాటిని పక్కకు నెట్టుకుంటూ ముందు కెళ్లాలి. మతాలన్నింటిలో కనిపించే మూఢవిశ్వాసాలు, ఛాందసవాదం, సంకుచిత ధోరణుల వల్లే మనుషులు దోపిడీకి గురవుతున్నారు" అంటాడు భగత్‌సింగ్. మతం దోపిడీదారుల చేతుల్లోని ఒక సాధనమని ఆయన ఆనాడే గ్రహించాడు. కాబట్టే 1924లో తన పదిహేడేళ్ల వయసులోనే "విశ్వమానవ సౌభ్రాతత్వం" అనే అద్భుతమైన రచన చేశాడాయన. అందులో "ప్రపంచంలోని మానవు లందరూ ఒకటే.. ఎవరూ మరెవరికీ పరాయి కాదు" అంటాడు. "నలుపు-తెలుపు, నాగరికులు-అనాగరికులు, పాలకులు-పాలితులు, ధనిక -పేద, అగ్రవర్ణాలు-అంటరాని వర్గాలు అనేవి ఉనికిలో ఉన్నంత కాలం విశ్వమానవ సౌభ్రాతత్వం ఎలా సాధ్యమవుతుంద"ని ప్రశ్నించాడు. ఇవి సర్వమానవ సౌభ్రాతృత్వానికి అవరోధాలని చెప్పాడు. ఆ వయసులో ఎవరైనా అంతటి ఆలోచనాపరులై ఉంటారని ఊహించగలమా? కానీ ఆయన అలాంటి ఆలోచనలు కలిగి ఉండటమే కాదు, వాటి ఆచరణకు జీవితాన్నే ధారపోశాడు. మనిషి అసలు గుణం ప్రేమ. సహజీవన సౌందర్యం. అంతే కానీ కులమూ మతమూ కాదు అని చెప్పదలచుకొన్నాడు భగత్‌సింగ్. జనజీవితంలో అత్యంత సహజమైనవిగా ఉన్న లౌకిక విలువల పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించాడు. 1926లో "నౌజవాన్ భారత సభ" స్థాపన ద్వారా భగత్‌సింగ్ తన ఆలోచనలకు నిర్మాణ రూపమిచ్చాడు. ప్రజలకోసం ప్రజల చేత విప్లవం సాధించడం సభ లక్ష్యంగా ప్రకటించాడు. ఈ లక్ష్యసాధనలో మతం మన పురోగతికి అతిపెద్ద ఆటంకమని సభ ప్రణాళికలో నిర్దిష్టంగా పేర్కొన్నాడు. విభేదాలు పక్కనపెట్టి ఒక ఉమ్మడి అజెండాతో లౌకిక, ప్రజాస్వామిక ప్రాతిపదిక మీద కలసి పనిచేయడం ద్వారానే మనం పురోగమించగలమని చెప్పాడు. మతాన్ని రాజకీయాల నుండి విడదీయ గలిగితేనే మనం ప్రజలను ఐక్యంగా ఉంచగలమని స్పష్టం చేశాడు. భారతదేశ అభ్యున్నతిని కోరేవారెవరైనా దీన్నే అనుసరిస్తారని చెప్పాడు. భారత దేశానిది సమ్మిళిత సహజీవన సంస్కృతి అని నినదించాడు. నిజమే కదా..! 'భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. సుసంపన్నమైన బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం' అని నిత్యం ప్రతిజ్ఞ చేస్తున్నాం మనం. శతాబ్దాలుగా దేశం సంతరించుకున్న ఈ విలువలను కాపాడుకోవడం, సమున్నతంగా నిలబెట్టు కోవడం ఇప్పుడు కాలం మన ముందు నిలిపిన అతిపెద్ద సవాలు. ఈ సవాలును ఎదుర్కోవడానికి మనకిపుడు భగత్‌సింగ్ కావాలి. ఆయన భావజాలం కావాలి. భగత్‌సింగ్‌ను అర్థం చేసుకోవాలంటే ఆయన రచనలు చదవాలి. ముఖ్యంగా జైలు నోట్‌బుక్ మనకు ప్రధాన వనరు. ఆయన సాధించిన సైద్ధాంతిక పరిణితిని తెలుసుకోవడానికి అది చాలా ఉపయోగపడుతుంది. మిగతా రాజకీయ ఖైదీల్లా ఆయన జైలులో ఉండి ఆత్మకథలు రాసుకోలేదు. ఈ ప్రపంచాన్ని అధ్యయనం చేశాడు. గాయాలపాలైన ఈ నేల విముక్తికి మార్గాలను అన్వేషిం చాడు. మహామహులనేకమంది రచనలను, రాజకీయ సిద్ధాంతాలను లోతుగా పరిశీలించాడు. ఆ తరువాత మార్క్సిజం వెలుగులో భారతదేశ భవిష్యత్తును దర్శించాడు. నిస్తేజంగా పడివున్న ఈ నేలకు జవసత్వాలు కూడగట్టేందుకు అవసరమైన భావజాలాన్ని అభివృద్ధి చేశాడు. "దోపిడీ పీడనలు, అసమానతలు లేని సమాజ స్థాపన కోసం మన ప్రజలను సిద్ధం చేయాలి. ఈ విప్లవ బీజాలను నాటడానికి ఇప్పుడున్న పంటలన్నిటినీ ధ్వంసం చేయాలి. ముండ్లపొదలను పీకి తగల బెట్టాలి. బండరాళ్లను కంకరగా పగలగొట్టాలి. కిందపడిన వారిని పైకి లేవనెత్తాలి. అరాచకులకు మర్యాద నేర్పాలి. శ్రామిక ప్రజలను ఒక్కటి చేయాలి. ఇందుకు అడ్డుగా ఉన్న కులమతాల గోడల్ని కూలగొట్టాలి" అని నిర్దేశించాడు. ఈ లక్ష్య సాధనకు ఏంచేయాలో కూడా వివరించాడు. "ప్రజలు తమలో తాము పోట్లాడుకోకుండా వారిలో వర్గ దృక్పథాన్ని కల్పించాలి. కార్మికులకు, రైతులకు వారి మొదటి శత్రువు పెట్టుబడిదారుడని చెప్పాలి. వారు సృష్టించే కులమతాల ఉచ్చుల్లో పడవద్దని వివరించాలి. మనుషులు ఏ కులం వారైనా, ఏ మతం వారైనా, ఏ జాతి వారైనా ఒకే విధమైన హక్కులు కలిగి ఉంటారని తెలియజేయాలి. ఆ హక్కులు వారి ఐక్యతలో ఉన్నాయని, వారి సంక్షేమం అధికారాన్ని తమ చేతుల్లోకి లాక్కోవడంలో ఉందని అర్థం చేయించాలి" అన్నాడు. పెట్టుబడిదారీ ప్రభుత్వాలేవి ప్రజలను చైతన్యవంతులను చేసే కృషిని సమ్మతించవు. పైగా నిర్దయగా అణచివేస్తాయి. కనుక ఈ స్థితిని రూపుమాపాలంటే విప్లవం ద్వారా మనం అధికారాన్ని చేతుల్లోకి లాక్కోవాలంటాడు భగత్‌సింగ్. విప్లవమంటే రక్తపాతంతో కూడిన ఘర్షణలుకావు. అది బాంబులు, తుపాకుల పూజ కాదు. కొన్ని సందర్భాల్లో అవి కూడా లక్ష్యాన్ని సాధించే సాధనాలు కావొచ్చు. అంతే తప్ప అదే విప్లవమని చెప్పలేం. విప్లవమంటే నిజమైన అర్థం మెరుగైన మార్పు కోసం జరిగే పోరాటం. పాత నుండి కొత్తకు ప్రయాణించడం. మానవ చైతన్యం తిరోగమన శక్తుల్ని తొక్కుకుంటూ పురోగమించడం అంటూ విప్లవానికి నిర్వచనం చెప్పాడు భగత్‌సింగ్. "ఇప్పుడు ఈ తిరోగమన శక్తుల మూలంగా దేశం దయనీయ స్థితిని ఎదుర్కొంటోంది. ఒక మతస్తుడికి మరో మతస్తుడు శత్రువు అన్నట్టుగా ఉంది పరిస్థితి. ఎదుటి వ్యక్తి ముస్లిం అయితే చాలు.. అతడిని చంపడానికి హిందువులకు వేరే కారణం అక్కర్లేదు. ఎదుటివాడు హిందువైతే చాలు.. అతడిని చంపటానికి ముస్లింలకూ కారణమవసరం లేదు. అలాగే సిక్కులు కూడా. ఈ స్థితి మనుషులను ముక్కలు చేయడం తప్ప ఒక్కటిగా ముందుకు నడిపించగలదా? దీన్ని అడ్డుకోవడం, అధిగమించడం విప్లవకారుల కర్తవ్యం" అంటాడు భగత్‌సింగ్. నాడు లాహోర్‌లో చెలరేగిన మతకల్లోల నేపథ్యంలో ఆయన రాసిన "మతకల్లోలాలు వాటి పరిష్కారాలు" అనే వ్యాసంలో ఈ విషయాలన్ని సమగ్రంగా వివరించాడు. సరిగ్గా వందేళ్ల తర్వాత అవే పరిస్థితులు ఇప్పుడు దేశంలో కొనసాగుతున్నాయి. పైగా మతతత్వం అధికారంలోకి వచ్చి కూర్చుంది. దేశమంతటా విభజన, విద్వేష రాజకీయాలు మనుషుల్ని చీలికలు పేలికలు చేస్తున్నాయి. శాంతినీ సామరస్యాన్నీ ధ్వంసం చేస్తున్నాయి. మనువాదం మనిషిని తిరిగి మధ్యయుగాలకు మళ్లించజూస్తోంది. దారిలో ముండ్లు కనబడితే ఎత్తిపారేసే మనిషి, రాళ్లూ రప్పలూ ఎదురైతే తొలగించి నడిచే మనిషి ఇప్పుడు అచేతన జీవిలా మారిపోతున్నాడు. మనిషి మనిషిగా జీవించడానికి కావాల్సిన సహజమైన ఆవరణమే లేకుండాపోతోంది. ఈ ఆవరణాన్ని కమ్ముకుంటున్న చీకటిని ఛేదించే టార్చ్‌బేరర్ భగత్‌సింగ్. అందుకే మనకు భగత్‌సింగ్ కావాలిప్పుడు. ఈ స్థితిని అర్థం చేసుకోవడానికీ అధిగమించడానికీ కావాల్సినంత అవగాహననూ చేతననూ మనకందించి పోయాడు భగత్‌సింగ్. వాటిని అందిపుచ్చుకోవాలి. విద్వేషం వీధివీధినా పారుతున్న వేళ.. ప్రేమను గడపగడపకూ పంచిపెట్టాలి. రక్తసిక్తమైన హృదయాలకు లేపనాలు పూయాలి.. మతమౌఢ్యం మనకు వారసత్వంగా సంక్రమిస్తున్న ఓ పెద్ద అబద్ధమని కుండబద్ధలు కొట్టాలి. నీతికి మూలం మనిషే కావాలి తప్ప, మతం కాకూడదని నినదించాలి. భగత్‌సింగ్ ఇందుకు అవసరమైన చూపునిస్తాడు, పోరాడే బలమిస్తాడు. విధ్వంసమైన బతుకుల్ని విప్లవ కార్యాచరణకు నడిపించడమెలాగో వివరిస్తాడు. నిత్యం కాలం నుదిటిపై నిగనిగలాడే ఎర్రని సింధూరమతడు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన రూరల్ సీఐ కృష్ణ

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చి 21 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైనాయి. ఇట్టి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ మరియు పటిష్ట బందోబస్తు పోలీసులు నిర్వహించారు . పరీక్ష కేంద్రాన్ని నిర్మల్ రూరల్ ఇన్స్పెక్టర్ కృష్ణ తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేయడం జరిగినది. నర్సాపూర్ జి ఎస్ ఐ సాయి కిరణ్, సిబ్బంది రవీందర్ రెడ్డి, మమత ఉన్నారు



పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన రూరల్ సీఐ

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి




బోరంచు శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని పుత్లీ బౌలి లో అమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్లు తినిపించి రోజా ఉపవాసన్ని విడిపించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటిస్తూ ఉపవాసాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి అట్ల గోవర్ధన్ రెడ్డి, సమ్మ, ఖయ్యుమ్ ఖాజా, ఇర్ఫాన్,మైనార్టీ నేతలు తదితరులు ఉన్నారు.

## వార్షిక తనిఖీల్లో భాగంగా ఈరోజు భైంసా గ్రామీణ పోలీస్ స్టేషన్ రికార్డ్స్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్.

ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలి

క్రైమ్ రేటు తగ్గించే విధంగా సమన్వయంతో విధులు నిర్వహించాలి

పోలీస్ అక్క మరియు నారి శక్తి ప్రోగ్రాముల యొక్క విధులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ శుక్రవారం రోజున భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీల్లో బాగంగా తానికి చేయటం జరిగింది.జిల్లా ఎస్పీ మొదట పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి అనంతరం పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసరప్రాంతాల పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో పని చేసే సిబ్బంది యొక్క డ్రిల్ సమీక్షించారు మరియు ప్రతి శనివారం జరిగే డ్రిల్ పరేడ్ లో పాల్గొనాలని తెలిపారు. సిబ్బంది యొక్క జనరల్ కిట్ లో ఉండే వస్తువుల వివరాలు , వాటి యొక్క ఉపయోగాలు సిబ్బంది కి వివరించారు. వాటిని భద్ర పరిచే విదానాన్ని పరిశీలించటం జరిగింది. వెనువెంటనే పోలీస్ స్టేషన్ లో ఉన్న ప్రభుత్వ వాహన లను మరియు వాటి రికార్డ్స్ ను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జావ్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణవే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. నారి శక్తి ప్రోగ్రాం లో పాల్గొంటున్న మహిళా కానిస్టేబుల్లను ప్రోగ్రాం లో చేసే విడుల గురుంచి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ అక్క లో పాల్గొన్న మహిళా సిబ్బంది తో మాట్లాడి వారు వెళ్తున్న పాఠశాల గురుంచి క్షుణ్ణంగా అడిగి తెలుసుకుని వారికి తగిన సూచనలు చేశారు. నారి శక్తి లో పాల్గొనే సిబ్బంది బ్లూ కోల్ట్ ,పెట్రో కార్ డ్యూటీ లో ఉన్నప్పుడు 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని,స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పిడియాస్ రైస్ అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపాలని , పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పి పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. ఎస్పి గారి వెంట అవినాష్ కుమార్ ఐపిఎస్, సి.ఐ నైలు మరియు గోపినాథ్ , ఎస్.ఐ లు రవీందర్ , భాస్కరా చారి మరియు ప్రొబేషనరీ ఎస్ఐ సుప్రియ మరియు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## శ్రీకృష్ణ ప్రైవేటు హాస్పిటల్ లో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం.

### అనుకోకుండా ప్రమాదాలు జరుగుతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ ఆఫీసర్ పలు సూచనలు చేశారు





అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న భైంసా ఫైర్ ఆఫీసర్ రవి

నిర్మల్ జిల్లా భైంసా మార్చ్ 21 అమృత్ తెలంగాణ భైంసా పట్టణ కేంద్రంలో శుక్రవారం రోజు ప్రముఖ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యందు ఫైర్ ఆఫీసర్ రవి, ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై ఆవాహగాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హాస్పిటల్ సిబ్బందికి అవగాహన కల్పించి సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో దామోదర్ రెడ్డి డాక్టర్ అనిల్ కుమార్ ఫైర్ కానిస్టేబుల్లు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు

## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గా నూతన ఉద్యోగం వచ్చిన ఏ సాయి కృష్ణ

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఓల్డ్ హౌసింగ్ బోర్డు, వార్డ్ . నం 37,కాలనీ వాస్తవ్యులైన శ్రీ అంగునూరి రాజ శంకర్ ఏకైక పుత్రుడు అంగునూరి సాయికృష్ణ ఈ మధ్యనే తెలంగాణ ప్రభుత్వం వారు వెల్లడించిన ఫలితాలలో బిల్డింగ్ మరియు టౌన్ ప్లానింగ్ అధికారిగా ఎన్నిక కాబడినారు అదృష్టం కొలది మన ఆదిలాబాద్ మున్సిపల్ పట్టణానికి టౌన్ ప్లానింగ్ అధికారిగా కేటాయించబడినందున ఉద్యోగంలో నీయుక్తి కాబడిన శుభ తరుణంలో కమిషనర్ కి మర్యాద పూర్వకంగా కలిసి స్వీట్స్/ పుష్ప గుచ్చం అందించదం




మున్సిపల్ కమిషనర్ సివి ఎన్ రాజు మర్యాదపూర్వకంగా కలిసిన ఏ సాయి కృష్ణ మరియు తాజా మాజీ కౌన్సిలర్ అంబకంటి అశోక్

జరిగింది, వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన మున్సిపల్ కమిషనర్C.V.N రాజు & తాజమాజీ కౌన్సిలర్ అంబ కంటి అశోక్,కాలనీ వాసుల తరపున ప్రత్యేక అభినందనలు

## ఎల్.ఆర్.ఎస్ 2020 స్కీమ్ క్రింద ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల కొరకు ప్రభుత్వం 25 శాతం రిబెట్ తో కూడిన చెల్లింపులు





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : LRS 2020 స్కీమ్ క్రింద ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల కొరకు ప్రభుత్వం 25 శాతం రిబెట్ తో కూడిన చెల్లింపు ద్వారా ఎల్.ఆర్.ఎస్ క్రమబద్ధీకరణ ఫీజును మార్చి నెలాఖరు లోపు చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని ఈ విషయాన్ని ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులకు వివరిస్తూ, రిబెట్ సదుపాయం సద్వినియోగం చేసుకునేలా చూడాలని , ఇప్పటి వరకు ఎంతమంది పెమెంట్ చేశారు, తదితర వాటి పై శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా దాన కిషోర్ ప్రిన్సిపాల్ సెక్రటరీఆన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం మున్సిపల్,పంచాయితి దరఖాస్తులు 20,381LRS దరఖాస్తుల లో 1584 పే చేయడం జరిగిందని, ఇందులో 620 మందికి ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందని అన్నారు. మిగితా పెండింగ్ దరఖాస్తులు ఈ నెల 31 లోగా పేమెంట్ చేయాలనీ, గడువులోగా కడితే 25 శాతం రీబెట్ వర్తిస్తుందని, గడువు ముగిసిన తరువాత 25 శాతం రిబెట్ వర్తించదని ఆన్నారు. మున్సిపల్, పంచాయితి, మీ సేవలో , LRS Mail ద్వారా కూడా కట్టవచ్చని, ఈ అవకాశం కొద్ది రోజులే ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకోవాలని, అందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్, సంభందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు..జిల్లా పౌరసంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## జిల్లా స్థాయి ఇసుక కమిటి సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శుక్రవారం జిల్లా పాలనాధికారి రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి లతో కలసి సమావేశం నిర్వహించారు.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం జిల్లా కలెక్టర్ చైర్మన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది . ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ ,ట్రైన్ కలెక్టర్ ,జిల్లా అదనపు కలెక్టర్, ఏ డి మైన్స్, డిడి గ్రౌండ్ వాటర్ ఇరిగేషన్ పెన్ గంగా అధికారులు తదితరులు పాల్గొన్నారు .సంబంధిత మండలాల తహసిల్దార్లు జైనథ్ ,బీంపూర్, బేల,సాత్నాల ,బోరజ్, అధికారులను స్థానిక అవసరాలకు గాను తహసిల్దారులు సంబంధిత మండలంలో ఇసుక బీచ్ లను గుర్తించి నివేదిక ఇవ్వవలసిందిగా తెలిపారు. తహ సిల్దార్లు బీచ్ లను గుర్తించి ఇస్తే గ్రౌండ్ వాటర్ ,ఎడి మైన్స్ ,ఇరిగేషన్ రెవెన్యూ ,అధికారులు అందరూ కలిసి ఎంత ఇసుక ఉన్నది స్థానిక అవసరాలకు ఎంత వాడుకోవచ్చు ఆ వివరాలను నివేదిక రూపం లో త్వరగా పంపాలని ఆదేశించారు జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## ప్రతి ఒక్కరు నిబద్ధతతో విధులను నిర్వహించాలి – జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.

ప్రజలకు నాణ్యమైన సేవలను ప్రతి క్షణం అందించే విధంగా సిద్ధంగా ఉండాలి
పట్టణంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి.
అదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ మరియు మహిళా పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ.







అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : శాంతి భద్రతలను పరిరక్షణ ప్రతి ఒక్క పోలీసు ప్రధాన లక్ష్యంగా పట్టణంలో మరింత ఉత్సాహంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఈరోజు సాయంత్రం స్థానిక ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ మరియు మహిళా పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ మొదటగా సిబ్బంది ద్వారా పూల మొక్క అందుకొని స్వాగతాన్ని స్వీకరించారు. తదుపరి పోలీస్ స్టేషన్లో సందర్శించి పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాలపై ఆరా తీశారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసులపై చార్జ్ సీటు దాఖలు చేసి బాధితులకు సత్వర న్యాయం అదే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజలకు ప్రతి ఒక్క పోలీసు అధికారి సకాలంలో నాణ్యమైన సేవలను అందించినప్పుడే పోలీసు వ్యవస్థ యొక్క కీర్తి ప్రతిష్టను పెంపొందించబడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో విధులను నిర్వర్తించాలని సూచించారు. నూతన పోలీసు సిబ్బంది ప్రతి ఒక్క పోలీసు విధులను నేర్చుకుని నూతన ఉత్సాహంతో విధుల నిర్వర్తించాలని సూచించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ కై నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు, ట్రాఫిక్ సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా మహిళల సమస్యలపై త్వరితగతిన స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మహిళా పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ సమస్యలపై వచ్చిన మహిళలకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇస్తూ కుటుంబ సమస్యలను పరిష్కరించాలని లేనియెడల చటపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటుచేసుకున్న క్షణాల వ్యవధిలో సంఘటన స్థలాలకు చేరుకునే విధంగా అప్రమత్తమై ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు సునీల్ మరియు శ్రీనివాస్ ఎస్ఐలు అశోక్,పద్మ, ఇసాక్, పిఎస్ఎల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ సైన్స్ కళాశాలలో 24న జాబ్ మేళా





ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ లో ఈనెల 24వ తేదీ సోమవారం టీఎస్ కేసి (తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్)ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలోజాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జె సంగీత, టి ఎస్ కే సి కోఆర్డినేటర్ డాక్టర్. ఐ శ్రావణి, ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ మంజుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో హెచ్. డీ ఎఫ్.సీ యాక్సిస్ బ్యాంక్ లో బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈజాబ్ మేళాకు 30 సంవత్సరాల లోపు ఉండి ఏదైనా డిగ్రీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు ఒక జత రెస్యూమే, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒరిజినల్ అండ్ జిరాక్స్ సెట్, ఐడి ప్రూఫ్, పాన్ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం10 గంటలనుండి ఈ జాబ్ డ్రైవ్ ప్రారంభం అవుతుందని వివరాలకు 8106764653,ఎండి. ఇమ్రాన్అలీ9703533626 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## రుహాని టాలెంట్ గుర్తించాల్సిందే..!




చి.ల.సౌ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భామ రుహాని శర్మ. ఆ సినిమాలో స్ట్రాంగ్ ఉమెన్ గా రుహాని నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఒక్క మూవీతోనే యూత్ లో రుహానికి మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇక ఆ తర్వాత రుహాని హిట్ సినిమాలో కూడ నటించింది. శైలేశ్ డైరక్షన్ లో విశ్వక్ సేన్ హీరోగా వచ్చిన హిట్ మూవీ కూడా అమ్మడి ఖాతాలో మరో హిట్ పడేలా చేసింది. ఆ తర్వాత డర్టీ హరి నూటొక్క జిల్లాల అందగాడు సినిమాల్లో కూడా నటించింది ఈ భామ. ఇక్కడే కాకుండా బాలీవుడ్ లో మ్యూజిక్ వీడియోలో కూడా రుహాని అదరగొట్టేసింది. ప్రస్తుతం ఆగ్రా మీట్ క్యూట్ సినిమాల్లో నటిస్తున్న రుహాని శర్మ గ్లామర్ షో చేయడంలో మాత్రం వెనకడుగు వెయట్లేదు. అమ్మడు చేస్తున్న ఈ షోకి రోజు రోజుకి తన ఫాలోవర్స్ పెరుగుతూ వస్తున్నారు. స్కిన్ షోలో నావెల్టీని జోడీస్తూ రుహాని చేస్తున్న ఫోటో షూట్ కి ప్రత్యేక ఆకర్షణ అవుతున్నారు నెటిజెన్లు. అంతేకాదు లేటెస్ట్ గా ఓ సాంగ్ కి డ్యాన్స్ చేస్తూ వీడియో చేసింది అమ్మడు. ఆ వీడియోని తన ఇన్ స్టా రీల్స్ లో షేర్ చేసింది. ఛాన్స్ దొరికితే ఎలాగోలా ప్రేక్షకులను మెప్పించాలని చూస్తున్న రుహాని శర్మ ప్రయత్నాలు వర్క్ అవుట్ అవుతున్నాయని చెప్పొచ్చు. అందం అభినయం రెండు కలగలిపి ఉన్న రుహానికి ఇంకా ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదని చెప్పొచ్చు. తనకి ఇచ్చిన పాత్రలో మెప్పిస్తూ వస్తున్న రుహాని శర్మ స్టార్ సినిమా ఛాన్సుల కోసం ఎదురుచూస్తుంది. లేటెస్ట్ ఇన్ స్టా రీల్స్ తో సోషల్ మీడియాలో వైరల్ గా మారిన రుహాని శర్మ.

## హీరోయిన్ ని ఆకాశానికి ఎత్తేసిన కేడీ!



అందమైన హీరోయిన్లు కనిపించేసరికి కొంత మంది హీరోలు మెలికలు తిరిగిపోవడం సహజమే. సహ నటులేన కాబట్టి ఆన్ సె ట్స్ లో వాళ్లతో ఉన్న ర్యాపో కారణంగా చనువుగానూ స్పందిస్తుంటారు. ఇంకా ఎక్కువ సినిమాలకు కలిసి పనిచేస్తే మంచి స్నేహితులు అయిపోతుంటారు. నాగార్జున.. బాలయ్య... చిరంజీవి లాంటి వారు హీరోయిన్ల అందాన్ని ఉద్దేశించి సరదాగా వ్యాఖ్యానిస్తుంటారు. అయితే ఈ తరం హీరోల్లో ఆ క్వాలిటీ చాలా రేర్ గా నే కనిపిస్తుంది. బన్నీ...రానా..చరణ్ లాంటి వారు మినహా చాలా మంది హీరోయిన్ల గురించి మాట్లాడటం రెండు ముక్కల్లో తేల్చేస్తారు. తాజాగా యంగ్ హీరో అడవి శేషు మాత్రం సహనటి మీనాక్షి చౌదరి గురించి ఏకంగా స్టేజ్ పై చాలా సేపు మాట్లాడి ఫోకస్ అయ్యాడు. ఇద్దరు జంటగా హిట్ ది సెకెండ్ కేస్ లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రచారంలో భాగంగా శేష్...మీనాక్షి చౌదరిపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు హైలైట్ అవుతోంది. బాంబే అమ్మాయిలా హాయ్ నమస్కారం.. వన్ ..టూ .. త్రీ చెప్పేసి కార్వాన్ ఎ క్కేసి వెళ్లిపోతుందనుకున్నా. కానీ తను నమస్కారం చెప్పడంతో పాటు చాలా వరకూ చక్కగా తెలుగులో మాట్లాడింది. అందుకోసం భాష కొంచెం నేర్చుకుంది. టీజర్ రిలీజ్ కే ఇలా కష్టపడిదంటే సినిమా కోసం ఇంకెంత కష్టపడుతుందో చెప్పాల్సిన పనిలేదు' అన్నారు. శేషు ఇలా స్పందించడం కొత్తేం కాదు. గతంలో. శోభిత ధూళిపాళ విషయంలోనూ ఇలాగే స్పందించాడు. 'గుఢచారి' సినిమాతో శోభిత తెలుగు తెరకు పరిచయమైంది. అందులో హీరోగా శేషు అడవి నటించాడు. ఆ సినిమా ప్రచార కార్యక్రమాల్లోనూ శోభిత గురించి ఇలా ఎంతో ఎగ్జైట్ మెంట్ తో స్పందించాడు. నిన్నటి సన్నివేశం నాటి సన్నివేశాన్ని గుర్తి చేసిందంటూ ఫిలిం సర్కిల్స్ లో చర్చకొచ్చింది. కొత్త హీరోయిన్లను ఇలా ప్రోత్సహించడం మంచిదే. వాళ్లకీ ఒణుకు..బెణుకు ఉంటే తొలగిపోతుంది. ఫ్రీగా మూవ్ అవ్వగలరు. అసలే రాష్ట్రం కాని రాష్ట్రం..భాష రాని భాషతో నెట్టుకురావాలంటే ఈ మాత్రం సహకారం తప్పనిసరే. అలాగే మీనాక్షికి తెలుగు కొత్తేం కాదు అన్నది గ్రహించాలి సుమీ. 'ఇచట వాహనములు నిలుపురాదు' సినిమా చేసింది. అటుపై మాస్ రాజా రవితేజతో కలిసి 'ఖిలాడీ'లోనూ నటించింది.

## చిరు- కమల్ లానే పవన్ బ్యాలెన్స్ చేయాలి



చిరు కమల్ లానే పవన్ బ్యాలెన్స్ చేయాలి

సినిమా తారలు రాజకీయాల్లోకి రావడం సహజం. కానీ రాజకీయాల్లో నెగ్గడం అంత సులువైన విషయం కాదు. అలాంటి అనుభవాలు మెగాస్టార్ చిరంజీవి.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్... విశ్వనటుడు కమల్ హాసన్.. విజయ్ కాంత్ లాంటి ఎందరో స్టార్లు చవి చూశారు. సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ ఆరంగేట్రం గురించి ఆలోచించి బ్యాక్ స్టెప్ తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే చిరంజీవి తిరిగి 'ఖైదీ నంబర్ 150'తో టాలీవుడ్ లో కంబ్యాక్ అయిన తీరు సంచలనమైంది. ప్రజారాజ్యం పార్టీని స్థాపించిన చిరు ఆ తర్వాత పార్టీని రూపు మాపి.. కాంగ్రెస్ లో చేరారు. తర్వాత కాలక్రమంలో ఇక రాజకీయాలతో సంబంధం లేకుండా ఇప్పుడు పూర్తిగా సినిమాలకే అంకితమయ్యారు. వరుసగా సినిమాల్లో నటిస్తూ బ్లాక్ బస్టర్లతో అభిమానులను అలరిస్తున్నారు. రాజకీయాల నుంచి సినిమాల్లోకి ఇది గ్రేట్ కంబ్యాక్ అని చెప్పాలి. ఇక విశ్వనటుడు కమల్ హాసన్ సైతం రాజకీయాల్లోకి వెళ్లి వెనక్కి వచ్చారు. ఆయన 'మక్కల్ నీది మయ్యమ్' అనే రాజకీయ పార్టీని స్థాపించినా తమిళనాడు ఎన్నికల్లో ఆశించిన విజయాన్ని దక్కించుకోలేదు. ప్రస్తుతం అతడు పూర్తిగా సినిమాలపైనే దృష్టి సారిస్తున్నారు. మరోవైపు బిగ్ బాస్ రియాలిటీ షో హోస్ట్ గాను బుల్లితెర అభిమానులను అలరిస్తున్నారు. ఇక కొన్ని వరుస డిజాస్టర్ల తర్వాత 'విక్రమ్' సినిమాతో సంచలన విజయం అందుకుని అతడు కంబ్యాక్ అయిన తీరు ఆసక్తిని కలిగించింది. కమల్ ఇక సినిమాలు చేస్తారా లేదా? అని బెంగ పట్టుకున్న వేళ అభిమానులకు విక్రమ్ రూపంలో గొప్ప ఊరట లభించింది. కమల్ తనదైన విలక్షణమైన ఆహార్యంతో మరోసారి దుమ్ము దులిపాడు.




## ఇలా కూడా మెంటల్ ఎక్కించేస్తున్న బ్యూటీ..!




ఆల్రెడీ కోలీవుడ్ లో సినిమాలతో పాటుగా వివాదాల్లో కూడా నిలిచిన అందాల భామ నివేదా పేతురాజ్ తెలుగులో వివేక్ ఆత్రేయ డైరెక్ట్ చ్జేసిన మెంటల్ మదిలో సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా హిట్ అవడం వల్ల ఆ డైరక్టర్ తీసిన బ్రోచేవారెవరురా సినిమాలో కూడా ఆమెని రిపీట్ చేశాడు. ఇక అప్పటినుంచి తెలుగులో వరుస సినిమాలు చేస్తూ వస్తుంది నివేదా పేతురాజ్. తెలుగుతో పాటుగా తమిళ సినిమాల్లో కూడా దూసుకెళ్తున్న నివేదా పేతురాజ్ కేవలం సినిమాలే కాదు సోషల్ మీడియా ఫోటోస్ తో కూడా తన ఫాలోవర్స్ ని అలరిస్తుంది.అంతేకాదు అమ్మడికి రేసింగ్ అంటే చాలా ఇష్టం. అందులో కూడా ఆమె నైపుణ్యత సాధించాలని చూస్తుంది. అప్పుడప్పుడు రేస్ క్లబ్ లో కార్ రేస్ చేస్తున్న వీడియోలని షేర్ చేస్తుంది నివేదా పేతురాజ్. అయితే రేసర్ గా ఉండాలంటే ఫిట్ నెస్ కంపల్సరీ అందుకే అమ్మడు సినిమాలు లేని టైం లో ఎక్కువ శాతం జిమ్ లోనే గడిపేస్తుంది. లేటెస్ట్ గా జిమ్ చేస్తున్న వీడియోని షేర్ చేసింది నివేదా పేతురాజ్. పర్ఫెక్ట్ బాడీ షేప్ కోసం నివేదా పేతురాజ్ బాగానే కష్టపడుతుందని చెప్పొచ్చు. నివేదా చేస్తున్న ఈ జిమ్ వర్క్ అవుట్స్ వీడియో తన సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com